క్లుప్తంగా

ముంపు ప్రాంతాలను పరిశీలించిన టిడ్కో చైర్మన్



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు పార్వతీపురం పట్టణంలో ముంపు బారిన పడిన ప్రాంతాలను ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు బారిన పడిన ప్రాంతాల్లో మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ గిరి రఘు

సాలూరు: మున్సిపాలిటీలో 22వ వార్డు సంకుర్తివీధికి మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక కౌన్సిలర్ గిరి రఘు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు లక్షల రూపాయలతో రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. రోడ్డు మంజూరుకు సహకరించిన మంత్రి రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని, శ్యామ్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపో పరిశీలన



కార్గో సేవలపై ఆరా తీస్తున్న సీటీఎం, తదితరులు

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపోను సీటీఎం (చీఫ్ ట్రాఫిక్ మేనేజర్) అప్పలనాయుడు , ఏటీఎం దివ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి, సమయానికి బస్సులు వస్తున్నాయా, లేవా అని ఆరా తీశారు. అనంతరం లాజిస్టిక్ కౌంటర్‌ను పరిశీలించారు. సమయ పాలన కచ్చితంగా పాటించాలని ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పలువురు ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ తిరుపతిరావు

పాచిపెంట: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల వివిధ రకాల తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి కె. తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మవలస గ్రామంలో సమగ్ర సస్యరక్షణ విధానాలపై రైతులకు శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి నాట్లు పూర్తయిన తర్వాత జిగురు పళ్లాలు, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు గట్లపై బంతి, కూరగాయ మొక్కలు వేసుకోవాలని సూచించారు. వరి నారు చివర్లు తుంచి నాటడం వల్ల అగి, పాముపొడ తెగుళ్ల అశించవన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు విజయ్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ అధికారి సుకుమార్‌బాబు

కురుపాం: స్థానిక సీహెచ్‌సీ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అంధత్వ నివారణ అధికారి డా. సుకుమార్‌బాబు మాట్లాడుతూ నేత్రదానం చేసి అంధులకు చూపునివ్వాలని, ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరికి అంధులకు చూపును ప్రసాదించే భాగ్యం కలుగుతుందన్నారు. అనంతరం నేత్రవైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక, సహాయకులు శైలజ, రోజా, మల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే మేమున్నాం...

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- గిరిజన గ్రామాల్లో గడప గడపకు.. కార్యక్రమానికి స్పందన



గిరిజన మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: మీ గ్రామంలో సమస్యలేమైనా ఉన్నాయా..? ఉంటే నిర్భయంగా చెప్పండి...మీ సమస్యలు పరిష్కరించేందుకు మేమున్నాం...అధైర్యపడవద్దు....ఏ సమస్యనైనా పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని ఎస్.పెద్దవలస సచివాలయం, నంద పంచాయతీ పరిధిలో నంద, నందబొడ్డవలస, కొత్తకామునివలస, పాతకామునివలస, ఎన్‌కే.గైశీల, పెద ఊటగెడ్డ గ్రామాలలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు గిరిజన మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో అభిమాన నాయకుడిపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు.

అనంతరం పలువురు ప్రజలు మాట్లాడుతూ, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మంత్రి స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జోగారావుతో మాట్లాడగా... వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు రూ. 15.40 లక్షలు మంజూరయ్యాయని ఏఈ తెలిపారు. ప్రస్తుతం టెండర్లు జరుగుతున్నాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి రాజన్నదొరకు వివరించారు. అలాగే నంద పంచాయతీలో అదనపు తరగతి గది నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి రాజన్నదొర మాట్లాడుతూ, గిరిజన గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. మారుమూల గిరిశిఖర గ్రామాల ప్రజలు గతంలో రహదారులు లేక ఇబ్బందులు పడ్డారని, అటువంటి ఎన్నో గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గిరిజన గ్రామాల సమీపంలో వంతెనలు, బ్రిడ్జిలు నిర్మించామని తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని డిప్యూటీ సీఎం రాజన్నదొర సందర్శించి, చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డి పి.దేవకుమార్, సీడీపీఓ అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంట సంజీవునాయుడు, మల్లేష్, పూడి శ్రీనివాసరావు, తిరుపతిరావు, తీళ్ల కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో డిప్యూటీసీఎం రాజన్నదొర

అక్షరాస్యతతో జీవితంలో వెలుగులు



పలగర సచివాలయం వద్ద మాట్లాడుతున్న ఎంఈఓ సామల

బలిజిపేట: అక్షరాస్యత అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన పలగర, బలిజిపేట సచివాలయాల్లో అక్షరాస్యత ప్రాధాన్యంపై పలు సూచనలు చేశారు. ఈ మహాయజ్ఞంలో అందరూ పాత్రధారులై నిరక్షరాస్యత నుంచి విముక్తిచేయి అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఇది మనం స్వచ్ఛందంగా చేయాల్సిన పని అని తెలిపారు. సార్వత్రిక విద్యపై అవగాహన కల్పించారు. అర్హులైనవారు సార్వత్రిక విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ప్రతి సచివాలయం పరిధిలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించి అందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌరీశంకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఫ్రైడే డ్రైడే అమలు చేయాలి



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, డీఐఓ జగన్‌మోహనరావు

సీతానగరం: ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి దోమల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి జగన్నాథరావు హితవు పలికారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో గూడెంవీధిలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకునే ఖాళీకుండలు, కొబ్బరిబురికెలను, పప్పులు రుబ్బేరోలులో నీరు లేనప్పుడే దోమలను నివారించవచ్చునన్నారు. డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, సూపర్‌వైజర్ శర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో ఆందోళనక్కర్లేదు..

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు రత్నకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రస్తుతం వరి పంటలకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, ఆందోళన అవసరం లేదని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి అన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు అధ్యక్షతన శుక్రవారం ఏఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్ష ప్రభావంతో నీట మునిగిన పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సచివాలయ వ్యవసాయ సహాయకులు ద్వారా రైతులకు అవసరమైన సహకారం క్షేత్ర స్థాయిలో అందిస్తున్నామన్నారు. ఈ - క్రాప్ నమోదు తాజా పరిస్థితిపై ఏఓ ఎన్ని వాహిని వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈ - క్రాప్ చేయించుకోవాలన్నారు. తద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన పెంచుకొని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, పలు పంచాయతీలకు చెందిన రైతులు, సల హా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిన నీటితో రాకపోకలకు అవస్థలు



బ్రిడ్జి వద్ద చేరిన వర్షపు నీటిలో రాకపోకలు ఇలా...

కొమరాడ: కూనేరు రైల్వేస్టేషన్ సమీపంలో సరుగుడుగూడ గ్రామానికి వెళ్లే రహదారిపై మూడో రైల్వేలైన్ కింద ఉన్న బ్రిడ్జి వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. దీన్ని మళ్లించకుండా రైల్వే అధికారులు అలా విడిచిపెట్టేయడంతో నీరు నిల్వ ఉండి ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉలిపిరి పంచాయతీ సరుగుడుగూడ గ్రామం వైపు ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీని వల్ల అటువైపు గిరి శిఖర సుమారు 12 గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదని సీపీఎం మండల కన్వీనర్ కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో గిరిజనులు కూనేరు రైల్వేస్టేషన్ మాస్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వైద్య సేవల విషయంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని కోరారు.

దారునాయక్‌పై చర్యలు తీసుకోవాలి



దారునాయక్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరపై నిరాధార ఆరోపణలు చేసిన టీడీపీ నాయకుడు దారునాయక్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్‌లు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అవినీతికి పాల్పడ్డారంటూ దారునాయక్ ఇటీవల చేసిన ఆరోపణలను అర్థరహితమన్నారు. రాజకీయ ఉనికి కోసం ఆరాట పడుతున్న కొందరు టీడీపీ నాయకులు గిరిజనులకు అండగా నిలుస్తున్న రాజన్నదొరను నైతికంగా దెబ్బతీయాలనే కుట్రతో ఈ విధమైన నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే పోలీసులు స్పందించి దారునాయక్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు గిరి రఘు, సింగారపు ఈశ్వరరావు, గొల్లపల్లి వరప్రసాదరావు, లింగాల దుర్గ, పాలవలస మధుసూదనరావు, గొర్లె వెంకటరమణ, హరిబాలాజీ, బవిరెడ్డి సత్యప్రసాద్, చిన్ని, పిరిడి రామకృష్ణ, మజ్జి అప్పారావు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు పూర్తిస్థాయి సేవలు అందించాలి

పార్వతీపురంటౌన్: ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పార్వతీపురం డిపో, బస్‌స్టేషన్‌ను, పార్సిల్, డిపో గ్యారేజీని సందర్శించారు. అనంతరం గేటు మీటింగ్ పెట్టి గ్యారేజీ సిబ్బంది, కండక్టర్, డ్రైవర్లకు డిపో ఆదాయం, పార్సిల్ ఆదాయం పెంచడానికి, సమయపాలన పాటించడానికి సూచనలు ఇచ్చారు. గేటు మీటింగ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్, ఇన్‌చార్జ్ డిపోమేనేజర్ కె.సుమిత్ర, గ్యారేజీ ఇన్‌చార్జ్ ఎల్. రాములు పాల్గొన్నారు.



గేటు మీటింగ్ నిర్వహిస్తున్న డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

పాలకొండ రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తున్న క్రమంలో గ్రామీణ ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూసేందుకు సచివాలయాల సిబ్బంది అందుబాట్లో ఉండాలని వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ అన్నారు. లుంబూరు, ఓని, పనుకువలస, ఎల్ఎల్.పురం గ్రామాల సర్పంచులతో కలసి సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. వర్ష ప్రభావంతో పొలాల్లో నీరు చేరటం, విద్యుత్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులపై ఆరా తీశారు. సంబంధిత సిబ్బంది సచివాలయాల ద్వారా పంచాయతీల్లో చోటుచేసుకుంటున్న ఇబ్బందులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అధిక వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. ఆయన వెంట సర్పంచులు ఎస్.మంగామణి, కె.మంజుభార్గవి, కె.రవణమ్మ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



విశేష అలంకరణలో కామాక్షమ్మ



సంతోషిమాత ఆలయంలో అమ్మవారు

సాలూరు: పట్టణం, మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణమాసం నాలుగో శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, కామాక్షమ్మ, సంతోషిమాత, తదితర ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించడంతో ఆలయాలు కిటకిటలాడాయి.



కామాక్షమ్మ ఆలయంలో చేస్తున్న సామూహిక కుంకుమ పూజలు

ఆలయాల కిటకిట



బలిజిపేట: చిలకలపల్లి సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: వేణుగోపాలస్వామిఆలయంలో వరలక్ష్మీ పూజలు

బలిజిపేట: శ్రావణ మాసం చివరి, నాల్గవ శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో బలిజిపేట మండలంలోని చిలకలపల్లి సంతోషిమాత ఆలయంలో మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులతో పూజలు చేయించారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు

సీతానగరం: శ్రావణమాస మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పర్వదినం కావడంతో మహిళలు అంత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ మేరకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు వరలక్ష్మీ అమ్మవారికి భక్తులతో అభిషేకాలు, పూజలు చేయించారు.



పార్వతీపురం టౌన్: సంగంవలసలో పూజల్లో పాల్గొన్న మహిళలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పార్వతీపురంటౌన్: మండలంలోని సంగంవలసలో గల శ్రీ కోటదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం కావడంతో అమ్మవారికి కుంకుమపూజలు, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు పోటీ పడ్డారు.

డీవీఈఓకు సన్మానం



డీవీఈఓ మంజులా వీణను సత్కరిస్తున్న అధ్యాపకులు సిబ్బంది

సీతానగరం: వృత్తి విద్యాశాఖ రాష్ట్ర ఉత్తమ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా డీవీఈఓ మంజులా వీణను స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీజీఎస్ వి.త్రినాథ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు,సిబ్బంది దుశ్శాలువాతో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి విద్యాబోధన చేయాలని సూచించిన మేరకు జూనియర్ కళాశాలల్లో పనులు జరిగాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకోవాలని, అధ్యాపకులు ఉత్తీర్ణతాశాన్ని పెంచాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్వీ ప్రసాద్,అల్లాడ రామారావు, దాసరి రామకృష్ణ, వినోద్, నవీన్, అమ్మాజీ, అనూరాధ, గంగరాజు, రాశేఖర్, అచ్చంనాయుడు, శ్రీనివాసరావు, మయూరి, శ్రీధర్ పాల్గొన్నారు.